సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 10 । జూలై । 2023



వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాణాన్ని సంధిస్తున్న సీఎం

ప్రగతిపైనే గురి



గండికోటలో నమూనాను పరిశీలిస్తున్న సీఎం



పులివెందులలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్, తదితరులు



పులివెందుల సిటీ ఫారెస్ట్ ముఖ ద్వారం వద్ద సీఎం వైఎస్ జగన్



ఒబేరాయ్ సంస్థతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం



గండికోటలో జరిగిన సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రోజా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఒబేరాయ్ కంపెనీ ప్రతినిధులు

- గండికోటలో ఒబేరాయ్ గ్రూప్ హోటల్స్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- పులివెందులలో రూ.142.37 కోట్లతో పలు నిర్మాణాలు, ప్రారంభోత్సవాలు

సాక్షి ప్రతినిధి, కడప: వైయస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండో రోజైన ఆదివారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ప్రగతికి పచ్చ జెండా ఊపారు. గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. తిరుపతి, విశాఖపట్నం ఒబెరాయ్ హోటల్స్‌కు కూడా వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఇవాళ ఒబేరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకి వచ్చి సూపర్ లగ్జరీ సెవన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతుంది. ఇలాంటి పెద్ద గ్రూపులు వచ్చి హోటల్స్ కడితే గండికోటని గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి తీసుకొనిపోగలుగుతామని అన్నారు.

అభివృద్ధికి నిదర్శనం పులివెందుల

అభివృద్ధిలో నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం దేశానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పట్టణంలో నలువైపులా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలియ తిరగడంతో పులివెందుల పులకించింది. అభిమాన నాయకుడిని చూసేందుకోసం పులివెందుల దారులు వెంబడి వేచి ఉన్నారు. ముఖ్యమంత్రి కన్పించగానే జగనన్నా...అంటూ యువత కేకలు వేస్తూ ఆనందం వ్యక్తం చేయగా, మహిళలు, వృద్ధులు చేతులు ఊపుతూ కన్పించారు. పులివెందుల పట్టణంలో రూ.3.25 కోట్ల పాడా నిధులు వెచ్చించి అధునాతన వసతులతో నూతనంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.16.18 కోట్ల వ్యయంతో ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ నూతనంగా అభివృద్ధి చేసిన పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణి తోపు)ను ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. 30 ఎకరాల్లో ఉన్న ఈ వనంలో ఆకట్టుకునే ఎంట్రీ ప్లాజా, మార్కెట్ బ్లాక్, పాత్ వే, పార్కింగ్ ఏరియా స్టోన్ గజెబో, అందమైన శిల్పాలు, ఆహ్లాదకరమైన గ్రీనరీ ఇక్కడి ప్రత్యేకతలుగా నిలిచాయి. సిటీ ఫారెస్ట్ ప్రాంగణంలోనే రూ.39 కోట్లతో అభివృద్ధి చేసిన గరండాల రివర్ ఫ్రెంట్ (ఫేస్-1) గార్డెన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 3 ఎకరాల విస్తీర్ణంలో 1.25 కిలోమీటర్ పొడవుతో నిర్మితమైన ఈ పార్కులో రెండు చెక్ డ్యాములు, బోటింగ్, ఫ్లోటింగ్ జెట్టీ, వ్యూ పాయింట్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ మొదలైన సదుపాయాలున్నాయి. పార్కులో ఎంట్రీ ప్లాజా, యోగా, వాటర్ ఫౌంటెన్, బీచ్ వాలీబాల్, మియావకీ ఫారెస్ట్, హార్డ్ అండ్ సాఫ్ట్ స్కేప్స్, ఓపెన్ జిమ్ తదితర సదుపాయాలు కల్పించారు.

నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు..

ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమి ఏర్పడితే ఈ ప్రాంత నిరుద్యోగులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రూ.32.82 కోట్లతో అధునాతన వసతులతో 8 ఎకరాల్లో 'వైఎస్ఆర్ ఐఎస్‌టీఏ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీ'కి ఏర్పాటు చేశారు. 240 మంది కెపాసిటీతో అకాడమిక్ బ్లాక్, 100 మంది కెపాసిటీతో హాస్టల్ బ్లాక్, 200 మంది కెపాసిటీతో మల్టీపర్పస్ హాల్ భవనాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఇందులో డ్రోన్స్, ఆటోమోటివ్, రబ్బర్, టూరిజం, హాస్పిటాలిటీ, కట్టడాలు, ఐటీ, ఐటీ విద్ టెక్నాలజీలకు సంబంధించి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్ ఆధ్వర్యంలో ఏపీ కార్ల్ ప్రాంగణంలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లైవ్ స్టాక్ ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించే సప్లిమెంట్స్ తయారీలో పేరెన్నికగన్న 'న్యూ టెక్ బయో సైన్సెస్'ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మొదటిదశలో సంవత్సరానికి రూ.50కోట్ల టర్నోవర్ లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈసంస్థలో 50 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనుంది. మరో రూ.26.12 కోట్ల రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) నిధులతో 12.86ఎకరాల్లో 12 రకాల క్రీడాంశాలకు సంబంధించిన 'వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీ'ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాకీ, ఆర్చరీ బ్లాకుల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలకు శుభారంభం పలికారు.

నేటి సీఎం పర్యటన వివరాలు



కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కడపలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారు. నేటి పర్యటన వివరాలివి...

- ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్స్ నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 9.20 గంటలకు కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.25 నుంచి 10.00 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 10.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు రాజీవ్ మార్గ్ చేరుకుంటారు.
- 10.20 గంటల వరకు రాజీవ్ మార్గ్ రోడ్డు ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 10.25కు రాజీవ్ పార్కు చేరుకుంటారు.
- 10.35 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారు.
- 10.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయ లుదేరి 11.00 గంటలకు కొప్పర్తి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.10 గంటలకు అల్ డిక్సన్ యూనిట్‌కు చేరుకుని ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.35 నుంచి 11.45 గంటల వరకు పారిశ్రామిక యూనిట్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో గడుపుతారు.
- 11.55 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 12.10 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 12.15 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటకు గన్నవరం విమానాశ్రయానికి వెళతారు
- 1.30 గంటలకు సీఎం నివాసానికి వెళతారు.

ముఖ్యమంత్రి హోదాలో నాడు తండ్రి-నేడు తనయుడు



పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి హోదాలో పులివెందుల కౌన్సిల్‌కు 2007 డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. అప్పటి చైర్‌పర్సన్ రుక్మిణీదేవి హాయాంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు డాక్టర్ వైఎస్సార్ హాజరయ్యారు. అప్పట్లో మున్సిపల్ మీట్‌కు హాజరై కౌన్సిలర్లను అభినందించారు. తాజాగా ప్రస్తుత చైర్మన్ వరప్రసాద్ హాయాంలో నూతన అడ్మినిస్ట్రేషన్ భవనాలు పూర్తయ్యాయి.15 సంవత్సరాల తర్వాత సీఎం హోదాలో అదే మున్సిపాలిటిలో వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించి కౌన్సిల్ మీట్‌కు హాజరయ్యారు. అప్పట్లో తండ్రితో ప్రస్తుతం తనయుడు ఆ అనుబంధాన్ని పలువురు నెమరువేసుకున్నారు. పులివెందులకు ఎనలేని సేవలు అందిస్తున్న వైఎస్ కుటుంబం రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవోల పర్యవేక్షణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చక్కగా సాగాయి. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సీఎం వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయకుమార్, న్యూ టెక్ ఎండీ ప్రతాప్ రెడ్డి, ఏపీ కార్ల్ సీఈవో రమణారెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

'అనంత' జట్టు ఘన విజయం



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న కర్నూలు, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ తొలిమ్యాచ్‌లో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్ డ్రాగా ముగియగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడో రోజు ఆదివారం 320 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 81.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 407 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని ఎ.జయంత్‌కృష్ణ 119 పరుగులు చేశాడు. ప్రశాంత్ 141 పరుగులతో రాణించాడు. కడప బౌలర్ సాయిఆర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 71 ఓవర్లలో 248 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సి.విజయ్‌రామిరెడ్డి 90 పరుగులు చేశాడు. సాయిఆర్థిత్‌రెడ్డి 91 పరుగులు చేశాడు. అనంత బౌలర్ లోహిత్‌సాయికిశోర్ 5, ప్రదీప్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు. కాగా అనంత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 397 పరుగులు చేయగా, కడప జట్టు 148 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 408 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది.

డ్రాగా ముగిసిన కర్నూలు, చిత్తూరు మ్యాచ్

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన కర్నూలు, చిత్తూరు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 78 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 361 పరుగులు చేసింది. జట్టులోని నయీముల్లా 134 పరుగులు, సాయిసూర్యతేజారెడ్డి 47 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ ఎస్.ఎం.ఇర్ఫాన్ 3 వికెట్లు తీశాడు. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులు చేయగా, చిత్తూరు జట్టు 313 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

అడ్వాన్స్‌డ్ కంగ్రాట్స్

- మధ్యలో ఇళ్లు ఆపేసినవారికి ప్రభుత్వం చేయూత
- రూ.20 వేలు ముందుగా అందజేత
- ఇప్పటివరకు 23,249 మందికి రూ. 44.97 కోట్లు
- జిల్లాలో జోరందుకున్న గృహనిర్మాణం

కడప సిటీ : జిల్లాలో పేదల సొంతింటి కల తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 97,870 పక్కా ఇళ్లు మంజూరు చేసినా ఆర్థిక ఇబ్బందులతో కొందరు లబ్ధిదారులు నిర్మాణాలను మధ్యలోనే ఆపివేశారు. అటువంటివారిని ఆదుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. లబ్ధిదారులు ఏ దశల్లో ఇళ్ల నిర్మాణాలను నిలిపివేశారో గుర్తించి ఆ దశలను బట్టి రూ. 20 వేల వరకూ అందజేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా తోడ్పాటు అందించనుంది. ఇప్పటికే ప్రభుత్వం ఆర్థిక సమస్యలతో ఇళ్లు కట్టుకోవడం నిలిపివేసిన 23,249 మందిని గుర్తించి అడ్వాన్స్‌గా రూ. 44.97 కోట్లు అందించడంతో మళ్లీ ఇళ్ల నిర్మాణం జోరందుకుంది.

- గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల నిర్మాణాలను విస్మరించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లాకు భారీ స్థాయిలో మంజూరయ్యాయి. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 426 జగనన్న లే అవుట్లలో మొత్తం 97,870 పక్కా ఇళ్లు మంజూరైతే వాటిలో ఇప్పటి వరకు 22,682 పూర్తయి గృహ ప్రవేశాలు చేశారు. కాగా, ఇప్పుడు ఆగిపోయిన పక్కా ఇళ్లను పూర్తి చేయడానికి ప్రభుత్వం నడుంబిగించింది. లబ్ధిదారులకు మరో అవకాశాన్ని కల్పించింది. దశల వారీగా ఉన్న నిర్మాణాల ప్రకారం రూ.5000, రూ.10,000, రూ.15,000 గరిష్టంగా రూ.20 వేల వరకు అడ్వాన్స్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానం జూన్ 2వ తేదీనుంచి అమల్లోకి రాగా, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 23,249 మందికి అడ్వాన్స్‌గా రూ. 44.97 కోట్లు చెల్లించారు. ఈ కారణంగా ఇళ్లనిర్మాణ పనులు జిల్లాలో వేగంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. టిడ్కో ఇళ్ల నెపంతో పేద ప్రజల నుంచి డబ్బులు గుంజి నిర్మాణాలు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది.



వివిధ దశల్లో ఉన్న పేదల ఇళ్ల నిర్మాణాలు

- ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని మరింత ప్రోత్సహించేందుకు ఇళ్లు పూర్తిచేసుకునేందుకు రూ. 20 వేల మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చే ప్రక్రియను మొదలు పెట్టింది. క్షేత్ర స్థాయిలో కొంత మంది ఆర్థిక స్తోమత లేక నిర్మాణాలు కొనసాగక అరకొరగా పనులు జరిగి నిలిచిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఈ అడ్వాన్స్ వర్తించదు. జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట తదితర నియోజకవర్గాల్లో దాదాపు 23,249 మందికి అడ్వాన్స్‌గా రూ. 44.97 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఈ అడ్వాన్స్ పోనూ మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తుంది. సచివాలయాల ద్వారా సంబంధిత లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకున్న తర్వాత అడ్వాన్సును మంజూరు చేసి వారికి అందజేస్తున్నారు. ఈ అడ్వాన్స్ బేస్‌మెంట్ లెవెల్‌లో ఉంటే రూ.20 వేలు, గోడల వరకు నిర్మాణం ఉంటే రూ. 15 వేలు, అంతకుపైగా నిర్మాణాలు ఉంటే రూ. 10వేల నుంచి రూ.5 వేల వరకు ఇస్తారు.

జిల్లాకు మంజూరైన ఇళ్లు 97,870

జిల్లాలోని 31 మండలాల్లో 426 లే అవుట్లను పేదల ఇళ్ల కోసం నిర్మిస్తున్నారు. ఈ లే అవుట్లలో మొత్తం 97,870 ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అయితే ఇప్పటివరకు 22,682 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల పనులను మరింత వేగవంతం చేస్తున్నారు. ఇందులో అర్బన్ ప్రాంతాల్లో 57,830 గృహాలు, రూరల్ ప్రాంతాల్లో 40040 గృహాలను చేపడుతున్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల జిల్లా వ్యాప్తంగా 1263 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీటిని కూడా త్వరలో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ ప్రాంతాల్లో అయితే ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకునేలా స్థలాలు మంజూరు చేశారు. బేస్‌మెంట్ స్థాయికి రూ. 60 వేలు, గోడలకు రూ.60 వేలు, శ్లాబ్ దశకు రూ.30 వేలు, ఇల్లు పూర్తయ్యాక రూ.30 వేలు మొత్తం రూ. 1.80 లక్షలు లబ్ధిదారులకు అందనుంది. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు మెప్మా ద్వారా పావలా వడ్డీకి రూ. 35 వేలు రుణంగా తీసుకునే సదుపాయం కూడా కల్పించారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద ప్రభుత్వం పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు 93,470 ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈ రిజిస్ట్రేషన్‌కు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, మున్సిపాలిటీల్లో రూ. 15 వేలు, కార్పొరేషన్ స్థాయిలో రూ. 20 వేలు రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి అందుబాటులో ఉన్న సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ అయ్యేలా శ్రీకారం చుట్టారు. ఈ అవకాశం వల్ల ఇళ్లను అత్యవసరాలకు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకునే సదుపాయం కూడా ఉంటుంది.

అడ్వాన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం పేదల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి గృహాల నిర్మాణానికి అడ్వాన్స్ ఇచ్చే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. స్తోమత లేని వారిని సచివాలయాల సిబ్బంది సర్వే ద్వారా గుర్తించి తమకు జాబితా అందజేస్తే ఆ ఇంటి నిర్మాణ దశను బట్టి అడ్వాన్స్ చెల్లిస్తాం. ఈ అవకాశాన్ని సంబంధిత లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్‌శాఖ, కడప

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

గైనిక్ రాష్ట్ర సదస్సులో వక్తలు



డాక్టర్ శశికళకు జ్ఞాపిక అందజేస్తున్న వైద్యులు

కడప రూరల్ : అధునాతన వైద్య చికిత్స విధానంతో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని వక్తలు తెలిపారు. మూడు రోజులుగా కడపలోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో అబ్స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ యారాశి పద్మలత, సెక్రటరీ డాక్టర్ వై.ప్రమోదరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న గైనిక్ రాష్ట్ర సదస్సు ఆదివారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా వైద్యులు వరలక్ష్మి, నాగమణి, ప్రియాంకుర్ అధ్యక్షతన హారిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ అనే అంశంపై సెషన్ నిర్వహించారు. అలాగే పద్మావతి, సురేఖ చైర్ పర్సన్లుగా అబ్స్ట్రిక్ స్పెషల్ టాపిక్‌పై సెషన్ కొనసాగింది. అలాగే ఫెటల్ వెల్ బీయింగ్‌పై డాక్టర్ చంద్రిక, వాణి నేతృత్వంలో సెమినార్ జరిగింది. డాక్టర్ పద్మజ, విజయలక్ష్మి, సామా సుధ ఆధ్వర్యంలో ఇన్ఫెర్టిలిటీ అండ్ రీ ప్రొడక్టివ్ అనే అంశంపై సెషన్ నిర్వహించారు. సాయంత్రం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.ప్రమాద, పద్మలత, మృదుల, శశికళ, రమాదేవి, లక్ష్మి సుశీల, ఉషారాణి, శిల్పారెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం గైనకాలజిస్టులు మాట్లాడుతూ ఆధునిక చికిత్స విధానంతో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సతీష్‌రెడ్డి, కళావతి, సమిత, మల్లిక, శ్రీలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం.. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



గండికోటలో ఒబెరాయ్ హోటల్ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేస్తూ..

జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందుకు సంబంధించి ఆదివారం మరిన్ని అడుగులు పడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పర్యటనలో రెండో రోజు పలు అభివృద్ధి పనులకు అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని పర్యాటక కేంద్రం గండికోటలో ఒబెరాయ్ హోటల్‌కు శంకుస్థాపన చేశారు. పులివెందులలో మున్సిపల్ కార్యాలయ నూతన భవనం, సిటీ ఫారెస్ట్, గరండాల కెనాల్ డెవలప్‌మెంట్ మొదటి దశ పనులు, వైఎస్ఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, న్యూటెక్ బయోసైన్స్ కంపెనీ, వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభించారు.



పులివెందులలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



గరుండాల్ రివర్ ఫ్రంట్ కెనాల్‌లో బోటు నడిపే వ్యక్తికి ఆప్యాయ పలకరింపు



న్యూటెక్ బయోసైన్సెస్ కంపెనీకి సంబంధించిన పోషకాల తయారీ బ్యాగ్‌ను ప్రారంభిస్తూ..



సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శించిన చిన్నారులతో..



పులివెందుల వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమిలో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి



కొత్తపు సుబ్బిరెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల : మండలంలోని వై.కోడూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కొత్తపు సుబ్బిరెడ్డి (102) శనివారం మృతి చెందాడు. ఈయన 1921లో జన్మించారు. భారతదేశంలో విదేశీయుల పాలన ఉన్నప్పుడు స్వాతంత్య్రం కోసం జరుగుతున్న పోరాటాలను కళ్లారా చూశాడు. అనంతరం తమ గ్రామానికి ఉపసర్పంచ్‌గా పని చేశాడు. ఆయనకు ఆరుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు కొత్తపు వాసుదేవరెడ్డి గ్రామ సర్పంచ్ కొనసాగుతున్నాడు. ఇటీవల 100 ఏళ్లు పూర్తి చేసుకున్న కొత్తపు సుబ్బిరెడ్డికి కుమారులు, కుమార్తెలు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 102 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య వై. కోడూరు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రెండిళ్లలో చోరీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివరామక్రిష్టానగర్ నాలుగో వీధిలో ఆదివారం తెల్లవారుజామున రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివరామక్రిష్టానగర్‌కు చెందిన మాధవితో పాటు కుటుంబ సభ్యులు శనివారం ఊరికి వెళ్లగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి 60 గ్రాముల బంగారు వస్తువులు, రూ.40 వేల నగదు దోచుకెళ్లారు. అదే వీధిలోని రాజేశ్వరి పక్క వీధిలోని తన బంధువుల ఇంటికి వెళ్లగా.. దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి 75 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల దాడి



గాయపడ్డ సుబ్బరాయుడు

పెండ్లిమర్రి : మండలంలోని గోపరాజుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నంద్యాల సుబ్బరాయుడుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం మచ్చు కత్తితో దాడి చేశారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బరాయుడు వైఎస్సార్‌సీపీలో పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఓర్వలేని టీడీపీ నాయకులు గంగరాజు, రాధ, కొండయ్య, భైరేష్ మరికొందరు.. కొండూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై మినరల్ వ్యాటర్ క్యాన్ తీసుకొని వస్తున్న సుబ్బరాయుడుపై గ్రామ సమీపంలో మాటు వేసి మచ్చుకత్తితో తలపై దాడి చేశారు. చుట్టు పక్కల ఉన్న గ్రామస్తులు గమనించడంతో వారు పారిపోయారు. తీవ్ర గాయాలతో కింద పడ్డ సుబ్బరాయుడిని కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై రిమ్స్ ఔట్ పోస్టు పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. చికిత్స పొందుతున్న సుబ్బరాయుడును సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు.

బ్రౌన్ కేంద్రం అభివృద్ధికి కృషి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఆదివారం కడప నగరం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మల్లికార్జునుని జీవన గమనం పేరిట వెలువరించిన 'మల్లికార్జునీయం' పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రమించే తత్వం, ఆత్మీయత మంచి పేరు గడించి పెట్టాయన్నారు. సభాధ్యక్షులు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇష్టమైన రంగంలో విజయవంతంగా సాగిన ఆయన జీవనయానం ప్రత్యేక సంచిక ద్వారా తెలుస్తోందన్నారు. మైదుకూరు శాసనసభ్యులు రఘురామిరెడ్డి మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుని స్థాయి నుంచి స్వయంకృషితో ఆచార్యునిగా ఎదిగినా బ్రౌన్ కేంద్రం అంటే ఆయనకు మక్కువ అని తెలుస్తోందన్నారు. అనంతరం మూల మల్లికార్జునరెడ్డి లలిత కళానికేతన్ సంస్థ ద్వారా ప్రచురించిన మల్లికార్జునీయం అభినందన సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ఈ సంచికను సమీక్షిస్తూ మల్లికార్జునరెడ్డి తనను తాను చెక్కుకున్న శిల్పమని, ఇష్టమైన అన్ని రంగాల్లో వినయంతో విజయం సాధించారన్నారు. అనంతరం అతిథులు, ఆత్మీయులు, బంధుమిత్రులు మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయన సోదరుడు ఈశ్వర్ రెడ్డి, విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి, శివ ప్రసాద్‌రెడ్డి, దేవమునిరెడ్డి, అయ్యవారురెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

గాయపడిన వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ శివారులో ఈ నెల 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. కమలాపురం మండలం జె.కొత్తపల్లి గ్రామానికి చెందిన బార్లపల్లె బొర్ర భాస్కర్‌రెడ్డి(57) ఈ నెల 6న ఎర్రగుంట్లలో పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండుగా కడప రోడ్డులోని మైనింగ్ చెక్‌పోస్టు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా.. ఒకరికి గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలో ఆదివారం ఇనుము లోడుతో ప్రయాణిస్తున్న లారీ బోల్తా పడింది. స్థానిక విద్యుత్‌సబ్ స్టేషన్ సమీపంలో ఎర్రగుంట్ల వైపు ప్రయాణిస్తున్న లారీ అదుపు తప్పి రహదారి పక్కలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. లారీలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

మహిళల క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల అండర్-15, అండర్-19, సీనియర్ విభాగం ఎంపికలకు క్రీడాకారిణుల నుంచి విశేష స్పందన లభించింది. ఆంధ్రా క్రికెట్ సంఘం సీఈఓ ఎం.వెంకటశివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల క్రికెట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఇటీవలే ఆంధ్రా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు భారత జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అలాంటి క్రీడాకారిణులను స్ఫూర్తిగా తీసుకుని బాగా సాధన చేస్తే చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంధ్రా క్రికెట్ సంఘం క్రీడాకారిణులను ప్రోత్సహించడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ ఎంపికలకు హాజరైన క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేస్తామని, వారికి మ్యాచ్‌లు నిర్వహించి, తుదిజట్లను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ అకాడమీ చైర్మన్ పురుషోత్తంరావు, జిల్లా క్రికెట్ సంఘం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్, మహిళల క్రికెట్ సమన్వయకర్త కె.విష్ణుమోహన్‌రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారిణులతో ఏసీఏ సీఈఓ

తమిళనాడులో రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : తమిళనాడు రాష్ట్రం మధురై పట్టణంలో రెడ్డెమ్మతల్లికి ఆలయం ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ పదేళ్లుగా ఆషాఢమాసంలో హోమాలు, యజ్ఞాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురై పట్టణ పరిసరాల్లో ఓ భక్తుడు సంతానం లేక ఇబ్బంది పడుతూ కొన్ని దశాబ్దాల క్రితం గుర్రంకొండ మండలంలోని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి వచ్చాడు. అమ్మవారి దయవల్ల వారికి సంతాన ప్రాప్తి కలిగింది. వారు ఇక్కడికి వచ్చి ఏటా మొక్కులు చెల్లించుకొనేవారు. ఈనేపథ్యంలో వారి ద్వారా అక్కడి చాలా మంది భక్తులకు అమ్మవారి, సంతాన ప్రాప్తి గురించి తెలిసి తరచూ ఇక్కడికి వచ్చేవారు. దీంతో మధురై పరిసర ప్రాంతాల నుంచి రెడ్డెమ్మతల్లికి భక్తుల సంఖ్య పెరిగింది. మొదట్లో సంతానం కలిగిన సదరు భక్తుల వారసుడు సతీష్ అనే వ్యక్తి.. అమ్మవారి మీద భక్తితో అక్కడే ఆలయం నిర్మించాలని తలంచాడు. పదేళ్ల కిత్రం మధురై పట్టణ పరిసరాల్లో రెడ్డెమ్మతల్లి ఆలయం నిర్మించారు. అక్కడి సంప్రదాయాల ప్రకారం ఏటా ఆషాఢమాసంలో అమ్మవారి ఆలయంలో నిర్వాహకులు శాంతిహోమం, చండీయాగం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఆదివారం అక్కడి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ హోమాలు, యజ్ఞాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామికి దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆలయాలు ఉండటం అందరికీ తెలిసిన విషయమే. అయితే అన్నమయ్య జిల్లాలో మారుమూల ఉన్న రెడ్డెమ్మతల్లికి తమిళనాడు రాష్ట్రం మధురైలో ఆలయం ఉండటం.. అక్కడి ప్రజలు, భక్తుల చేత పూజలు అందుకోవడం విశేషం.



తమిళనాడు రాష్ట్రం మధురైలో రెడ్డెమ్మతల్లి ఆలయం

'గొంటుముక్కల'కు అవార్డు ప్రదానం

గోపవరం : మండలంలోని రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గొంటుముక్కల గోవిందుకు మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ జాతీయ ఇన్స్పిరేషనల్ రైటర్ అవార్డును ప్రదానం చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ అవార్డును అందజేశారు. 25 ఏళ్లుగా తెలుగు సాహిత్యంలో గొంటుముక్కల చేస్తున్న సేవకు గుర్తింపుగా సంస్థ వ్యవస్థాపకులు మహేష్ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సామాజిక స్థితిగతులపై ఎప్పటికప్పుడు తన కలం ద్వారా వివిధ పత్రికల్లో రాస్తూ, మరో వైపు ఆకాశవాణి కడప రేడియో కేంద్రం, సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన తన గొంతును వినిపిస్తూ సాహిత్య ప్రపంచానికి సుపరిచితుడయ్యాడు.



అవార్డు అందుకుంటున్న గొంటుముక్కల గోవిందు

డాక్టర్ శివానాయక్‌కు అవార్డు

కడప రూరల్ : కడప నగరానికి చెందిన ఫిజియోథెరపిస్ట్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఐ.శివానాయక్‌కు మేరీ మెక్ కలాం అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంఎస్‌పీ ఆడిటోరియంలో ఎంఎన్ఆర్ ఫిజియోథెరపీ కాలేజీ, ఫిజియెథెరపీ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ది రైస్ ఆఫ్ ఫిజియో అంతర్జాతీయ ఫిజియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివానాయక్ చేపడుతున్న సేవలను గుర్తించి ఆ ఫౌండేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్‌లు మేరీ మెక్ కలాం అవార్డును ప్రదానం చేయడంతోపాటు ఘనంగా సన్మానించారు. అవార్డు రావడం పట్ల డాక్టర్ శివానాయక్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శివానాయక్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న ఫిజియోథెరపీ ఫౌండేషన్ ప్రతినిధులు

బైక్ ఢీకొని రైతు దుర్మరణం

బి.కొత్తకోట : ఇంటి నుంచి పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న రైతును వెనుక వస్తున్న బైక్ ఢీకొనడంతో దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ రామాపురం వద్ద జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్పనాయక్ కథనం మేరకు.. మదనపల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన ఇనాయతుల్లా బైక్‌పై మండల కేంద్రం పెద్దతిప్పసముద్రం వెళ్లాడు. అక్కడ మిత్రుడి పెళ్లిచూపులు చూసుకుని మదనపల్లెకు తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలో ఉన్న రామాపురానికి చెందిన రైతు ఎ.వెంకటరమణ (45) గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. బి.కొత్తకోట వైపు నుంచి మదనపల్లె వైపు బైక్‌పై వెళ్తున్న ఇనాయతుల్లా అదుపుతప్పి వెంకటరమణను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో పందిళ్లపల్లె గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో ఎర్రగుంట్లకు చెందిన గణేష్ (22) అనే యువకుడు దుర్మరణం చెందాడు. అలాగే గంగయ్య అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుంట్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన గణేష్ అదే వీధికి చెందిన గంగయ్యతో కలిసి ఆదివారం రాత్రి కమలాపురం వైపు బైక్‌పై వెళ్తుండగా.. పందిళ్లపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. ఈ ఘటనలో గణేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే గంగయ్యకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గణేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బైక్ అదుపుతప్పి కింద పడి ప్రమాదం జరిగిందా? లేక గుర్తు తెలియని వాహనం ఢీకొందా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



మృతి చెందిన గణేష్

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ కుమార్తె నాగలక్ష్మి(19) ఇటీవల ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటి వద్ద క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.